# రవి చంద్రిక

మల్లాది రామకృష్ణశాస్త్రి

ఇది,– శివుని కథ అనుకునేరు:-
శ్రీనాథుని కథ:—

అంతా వాని కథ కాదు; ఆ చిన్నదాని కథ కొంత; యిక, సాంతం వినండి.

అప్పటికి రమారమి; పది పద్దెనిమిది సంవత్సరాలకు పూర్వం శ్రీనాథుడు దక్షారామంలో ఆరామం జేరుకుని, తన కవనం భీమ నాథునికి ధార పోసే,- ఆరోజుల్లో,—-

అత డలా ప్రబంధ నిర్మాణం జేస్తూ, తనకు తానుగానే ఆ కేళీవనంలో కాలం గడుపుతూండగా,- అవసరమైనప్పుడు తప్ప సాటివారూ. తోటి వారూ, ఆ చాయలకు వెళ్ళేందుకు జంకినారు కాని, సరసాలేలేందుకు వీరకంకణం కట్టుకున్న సాని కూతుళ్ళు ఊరకుంటారా?

భీమనాథుడే తమ వాడకు ప్రాత కాపా యెనే, యీ శ్రీనాథుడు లౌక్యానికి బింకాన బోయేను కాని, తగిన తీరున వాని తీరెరిగి లాలించితే, అయిన వేళ, తనకు తానై చనవునేయడా,- తమకించడా..

అనుకున్న వారై,- దర్శనానికని, దరి ప్రొక్కులకనీ, పాయస మందించేందుకనీ, పాన్పు సవరించేందుకనీ, దోరవయసు వారు..

తొంగలి చూపులతో
తోరపు నవ్వులతో

దొంతర విడె మందుకున్న వారై, బిడియముతో,- తడబడు వయారపు అడుగులతో, పలుకరించిన మారు వలుకనేరని అమాయకపు మోములతో,- గిలిగింతల వలె,– కేళీవనం క్రమ్ముకున్న వారై,–

ఎదుటపడి,, పలుకరించి,- కుశలమడిగి, వీవన – సేవలు జేసి, – ఏమరుపాటున ఏమో అన్నట్లు,– పయ్యెదకొంగు వాని మోమున సోకజేసి,- తెలుసుకుని త్రుళ్ళి పడినట్లు,-పడబోయినట్లుమీదకువ్రాలి,- ఇలా వారి చిత్తము వచ్చినట్లు,– వలరాయడు ఉపదేశించినట్లు,- వయారాలకు పోవంగా,– ఆనాడు పోనీ అనుకుని,– మరునాడు, మన కేల అనుకుని,– ఆ మరునాడు పోనీ అనుకుని,– చూసి చూసి, కలిపించుకుని,- వారం దరినీ చేరబిలిచి,-

వేడి సోకినా,- వెన్నెల కురిసినా,- పర్వతానికి ఒకటేనే,–



పడుచుదనపు పోకడలదానా!

భీమనాథుడూ మాణిక్యాంబా నను కన్నవారు.

యిది వారి కేళీవనము–ననుబోలిన వారికి తపోవనము.

నేను మీ పుణ్యాన బోలేనే,- వగలాడి!- యిలా మృదువుగా తెలియజెప్పగా, వారిలో ఓ జాణ....

ఏమయ్యా– మహాకవులని పేరు తెచ్చుకున్నారు,–

ఏ వగలాడి చేసోకనిదీ,– మీకవనం చేవలు దేరిందా? కొండవీటి సీమలో,– మగ, రాయడన్న వానికి, కొమ్మలకు కొదువ లేదట– తమ ఖ్యాతి మేమూ వినకపోలేదు–

యిది,- తపమను కొనలేదు-

తపన అనుకున్నాం.

మహాకవి మా సీమకు రాంగనే మొగబిడియ మాయె నేమో,- అయ్యో పాపమా అని,- చనవీయ వచ్చినాము -

కాదన్న-కూడదనములే!-

మీ కృష్ణా మండలమువారు,– మాటవాసి వారేనా?–

వీరు గడిదేరిన వేడుక కాడని,- వేడుకకు చేయించుకున్న ప్రచారమన్న మాట,-

అన్నమా చేకద!– కవితకు దాల్చిన అతిశయోక్తులను,– విని.– వీరెంతటి వారో దురో కదా అని,– యింత దూరము రావలసి వచ్చినది,-

యిలా బాలబోధ చేయవలసి వచ్చినది,-

మేము రప్పించుకునే వారమే కాని, రాకపోకల వారము కాము!

అది మా కులానికి బిరుదు - వరువీయ నేర్చినవారికి, - మా వరువాన మరియాద నేయడం,- మా వాడ బుట్టిన పడుచులకు ఘనత - రాజుల మన్నన లందినవారు,- రసిక రాజు లను కొంటిమి.

మాటల పొందిక నేర్చిన మానసమ్మున మదనుని సింగిణి మార్మోగు ననుకొంటిమి!

కవనాల రాయడు, - గడిదేరిన కమను డను కొంటిమి-

అని - వింటిమి!-

అమ్మక చెల్ల:- ఆ ముచ్చటలెల్ల కల్లలని,- మోముజూసి, తెలుసుకుంటిమి..,"

యిలా ఎకసెక్కెములు పలికి,– తోటి వారిని పేరుపేరున పిలిచి,- "ఓసి వాలుజూపులదాన, వయారంపు నడకలదాన, - తమ్మి మోముదాన, తలిరు - మోవిదాన ఉవ్వెత్తుల సువారముదాన- ఉలికే కౌనుదాన,- చిక్కని కటిదాన,- చిగురు నవ్వులదాన, మంచి ముత్తెపు చినుక, రతిచేతి రాచిలుక,- మన కేలనే వీనితోడి చెలిమి!-" అని అందరినీ కూడగట్టుకున్నదై,- తామందరూ కలసి పకపకలాడి,- కవితాకాముకా! సెలవయా!- చలింత నేరని మగరాయా సెలవయా! - నవరసాలు చదువగ చదివీ, సరసం నేరని సర్వజ్ఞా - సెలవయా!-" అని మరి మరి కవ్వించి,- ఎట్టకేలకు, ఏదో వేళకు,- ఆయన మానాన ఆయనను విడిచి కదలి పోయినవారు కాగా,-శ్రీనాథుడు. అమ్మయ్యా! అనుకుని నిశ్వాసమంత చిరునవ్వు తెచ్చుకుని, "స్వామీ! యీ జగజంతలతో ఎలా వేగుతున్నావయ్యా,- చేతకాని వానితో





చెలగాట మాడి రమ్మని,- తగిన వారిని వెదకి దండు పంపినావా ?- మా తల్లి కనుల చలువను. పడి లేచిన చిలుకహుమాయి దొర,- అంతో యింతో, నీ మీద గింకిరి తనము చేసేనుకాని,- నీ లెంకల జోలికి వచ్చేనా,- రానిచ్చేవా ?- అని నమ్మకంగా. అనుకున్నవాడై,- మళ్ళీ తన ధ్యాసలో తాను ఉండగా.—

సంజె నీడలు పారాడే వేళ,- చక్కందనమే,— తానైన బాల.— మనసే తోడుగా. మక్కువే చేదోడుగా,— సొగసుల తళుకే వాదోడుగా కవనం చిగురించే ఆ వనంలోకి,— మలయ పవనం తీరున,— సోకినంతలో,— శ్రీనాధుడు,— అటు జూచి



పెదవి విరిచినాడు. ఆ చిన్నది కన్నులతో మందలించినది. బొమ్మని సైగ చేసినాడు : చివాలున వెమతంజవేసి,— దోసెడు మల్లెలు దూసి,— చిరునవ్వు విసిరి,— ఉన్న చోటనే ఉండి,— వానిమీద విరజల్లినది: ఆ విసురుకు,— ఉలిపొర పయ్యెద చెరగు,— మిడిసి పడంగా.— మారన్న కుమారునికి,— అప్పటికి నవ్వు వచ్చింది,— ఆ నవ్వులలో నవ్వుగా,—

"దరిజేరనీని దైవాన్ని, చిత్తము వచ్చి నటుల సేవించు కున్నాను—" అన్నది....

"సేవల కని వచ్చిన కొమ్మను చేర దీసేందుకు అలయంలో ఉన్న ఆ ఘనుడే సరి—"

"ఆ ఘనుడు కైవల్య మిచ్చేను; యీ కవిరాయడే నా కామితము దీర్చేను-"

"కవి రాయడు కాసులకు పేద!"

"కావచ్చునేమో కాని, బాసలకు పెన్నిధి:

నేను కోరినది, కొంగున బంగారము కాదు, ఒక్క దీవెన!— మరి కొసరను!....

మన తనయుడు,— తండ్రిని మెప్పించే మహాకవి కావలె!..."

"ఓసి ముద్దరాలా!— ఒక్క మొగ్గను రెండు పూవులు చేసినావు కదవే!— నీవెంత కీర్తి కాముకివే!— కోరిన కోరిక పరు వైనదే—

కాని,— తీరా,— ఆ మగబిడ్డ,— మహా కవి అమేనో,— మార్దంగికుడౌనో,— చేత మనది కావచ్చునేమో కాని.

వాని గీత మన చెప్పుచేతలలో లేదుగా— అదిన్నీగాక,-

దేవుడు వరమిచ్చినా,- నరుడు పరుపీ యని, వాడకట్టున మగపుట్టుక పుడితే.- అయిన వాడినీ కానివాడినీ,- బావా అని పిల వాలిసిన అగదేగాని,- అందలం ఎక్కేనా?-

అందలాన బెట్టినా కుందనాన బెట్టినా, ఆడ పోడిమికి వసరుగాని,- అర్భకు డెందు కులే!— అంతగా, సంతుమీద మనసైతే,- ఆడపిల్ల కలగాలని కోరుకో: అంతో యింతో నా ఓపిన కొలది నేనూ దీవించేను. ఆలయంలో అయ్య దీవెన మీ కులానికి ఎలాగూ ఉండనే ఉన్నదిగా!— తల్లి పోలికే వచ్చిందా,- చిరునేతలు మరగిన వాడె వ్వడో,- పడకటింట చిదిపి దీపం పెడ తాడు. కనుముక్కు తీరు సలక్షణంగా ఉండి,- అన్ని హంగులూ అలంకారాలు ఒంటపట్టిన కల్యాణికి,- కవనం అబ్బటం అదేమంత మహా భాగ్యమా ?- కదళీ ద్రాక్షాపాకాలూ పలుకుల్లోనే ఉంటవి; శయ్య అంటావా,- అది,- సహజ సౌభాగ్యమే,— బంధ— చిత్ర కవిత్వాలంటావా,- అది, కృతిపతి అదృష్టాన్ని పట్టి వాటంతట అవే రూపొందుతాయి;

కనుక,- నీ మనస్సు ఎట్టిదైనా,- లోక కల్యాణం దృష్ట్యా- నీవు కుమార్తెల తల్లి వైతే,- యిటు యీ నరుడూ,— అటు ఆ దేవుడూకూడా మెచ్చడం జరుగుతుంది; దేవుని పెళ్ళికి అందరూ పెద్దలే కనుక, దైవ కృపను నీకు సంప్రాప్తించే సంతానం చేత "నాన్న" అనిపించుకునేందుకు, నేను ఎన్నటికీ వెనుకాడను, దైవం రక్షించి,— నీ బిడ్డ యీడేరి,- నా కళ్ళ ముందరనే గ్రంధ సాంగురాలైతే,- యిహ చెప్పనా?

యిదిగో,— చక్కని దానా!- నేను పుట్టి బుద్ధెరిగి,— ఎన్ని సీమలలో కలయ దిరి గాను,- ఎంద రెందరితోనో,— కలుపుగోలు తనంగా ఉన్నాను. కవనాలు వెదజల్లాను; ఘనంగా కట్టబెట్టించుకున్నాను. యింత వరకూ, మనకు రాబడే కాని పోబడి లేదు. యిన్నాళ్ళకు,— నీవంటూ వచ్చి,- ఎదుట బడి,— సరసంగా దేహీ అన్నావు,- కాదంటానా,— నిన్ను అమ్మా అన్న నోటనే ఆ బిడ్డ, నన్ను "నాన్న" అని పలుకరించి,— కవనాన గడితేరితే—అహో!- యిక అంత కన్న ఆనందం ఏముంటుంది! భీమనాధుడు నిన్నూ నన్నూ కరుణించి,- మన జన్మ చరి తార్థం అయ్యేట్టు చేయగలడులే,— యిక స్వామి సేవలకు పో(—"

అది,- అప్పటి ముచ్చట,

మరి, వారు కలుసుకోలేదు:



శ్రీనాధునికి,— అది జ్ఞాపకం కూడా లేదు:

కాని,- భీమనాధుడు,- మరువలేదు,—

మహాకవి దీవెన ఫలించింది, ఆడపిల్ల కలి గింది: వాడలో,- జాణలు,- నడికట్టు వేళ,- బాలపాప తండ్రి పేరు చెప్పించాలని జూశారు: ఉహుఁ: పరగణాలో,- సరసు డెవ్వరూ తనకా ఘనత ఆపాదించుకోలేదు:

పసిపాప ఒక్కనాడు,— గారుగీరుమన లేదు: చిరునవ్వల్లే పుట్టింది: చిరునవ్వే వెంట తెచ్చుకుంది: వయసు వచ్చినా,- పలుకు రాలేదు. పకపక హెచ్చింది. పాపం బంగారమంటి పిల్ల,— కాని,- మూగా,- పిచ్చి,—

అయిన వారూ, కాని వారూ,- పిల్లను చూసి,- కన్ను తుడుచుకునే వారు: కన్న తల్లి మట్టుకు చిన్నబోలేదు: ఏడాది వెళ్ళ గానే,— ఆలయానికి తీసుకు వెళ్ళింది: అప్పటికి నడకరాని పిల్లకు,- నడకా నాట్యం ఒక్కసారే వచ్చినవి: కులపు సానులకు అబ్బురం వేసింది: అందరూ తమ విద్యలు చూపించారు: యీ చిన్నది అందరికన్నా ఒక్క ఆకు పైనున్నది: అప్పటికి, వారికి తెలిసివచ్చింది: యీ బిడ్డ,— ఏసామిచ్చిన వరమో;—

ఆనాడు,- ఆలయానికి వచ్చిన బిడ్డ,- మరి యింటికి పోలేదు: ఉనికీ మనికీ అక్క డనే,- మూడు వేళలా నాట్యాన భీమనాధుని ఆరాధించేది: అప్పుడు ఊరూ నాడూ అంతా అక్కడే ఉండేది: పోను పోను మరీ తీర్థ ప్రజ: దూరాభారమనక వచ్చేవారు: వచ్చిన వారు ఓ పట్టున తరలి పోయేవారు కారు; దక్షారామం, రాజధాని కన్న ఎక్కువ సమ్మర్దంతో ఉండేది ఆ కథ, అక్కడికి అది,-

యిక్కడ,- శ్రీనాధుడు,-

అలా, స్వామివారి కేళీవనంలో నిష్ఠగా కూర్చుని,- భీమనాధుని మహిమను కొని యాడి, అప్పటికి ఓం తత్ సత్-అని మన సులో అనుకుని,- అతదుపరి రాణ్మహేం ద్రవరంలోనే,- శివైక చిత్తాన, ఉంటున్న వాడాయెను గద; మహామంత్రి బెండపూడి అన్నయ్యకు తానంటే ప్రాణమే,- రాజ్య పాలన జేసే వీరుడికి,- తానంటే దేవుడే,- తన కవనమంటే అమృతమే; అతగాడికి అక్కడ ఏ కొరతా లేదు : అసలు ఏ కోరికా లేదు:

ఒక్కనాడు సభకు పోయినదిలేదు,- మనసైనప్పుడల్లా మహారాజులే, దర్శనానికి దయచేసేవారు; అన్నయ మంత్రి,- ఒక్క క్షణం తీరిక చిక్కిందో,— యిక్కడే పడి ఉంటాడు. ఎన్నడన్నా, దక్షారామం వెళితే తప్ప; అదన్నా-మునుపటి లాగా,- తలచు కున్నప్పుడల్లా కాదు,- శ్రీనాధుడు, పోరగా పోరగా,- యిహ తప్పని సరిగా,-

యిన్నాళ్ళూ, దక్షారామం భోగట్టా అత డికి తెలియకుండానే ఉందా!- అన్నయ్య మంత్రికి ఎప్పుడూ అదే స్మరణైపోయె; శివుని మాటమరచిపోయి, ఆ చిన్నదాని ముచ్చటలే ఏకరువు బెట్టటమాయె-

తాను స్వామివారి కేళీవనం విడిచి,- ఆ దివ్యమూర్తులను సెలవడిగి,- అప్పుడు రావటం,- అంతే,- మరల అటు పదచ లనం చేయలేదు,

అయినా,- దక్షారామంలో, సారసాక్షికి, అది ఏనాడో చేసుకున్న పుణ్యాన ముత్తెమంటి కూతురు పుట్టిందని,- ఆ ముత్తెం, తళుకుదేరి రత్నం అయిందనీ,- అది,— రత్నం కాదు.- స్వామి వారు జడలకెంపుల్లో తురుముకున్న నెలవంక,- వరమంది,- రూపంది, తెలిసో తెలియకో,- అయ్య[illegible]రసెక్కిన మిడిసిపాటుకు పరిహారంగా. యిలా సేవించుకుంటూన్నదవీ.- ఆ పుట్టుక అలాటి దేవ రహస్యం కనుకనే., ఎవరికి పుట్టిన బిడ్డా కానట్టూ పేరన్నా లేకుండా యింతవయసుకు వచ్చిందనీ,- పిల్ల దానికి ప్రాయం రావడం,- ఎలా ఉన్నదంటేను, అది, లేతవెన్నెల ముదిరిన పోజెం కాని.- మనిషికీ, మానుకూ అబ్బే మామూలు నేవళం కాదనీ,_

మరో విశేషం,- ఆ చిన్నది.- స్వామి వారి సన్నిధిలో కింకిణులు కుణకుణ మనిపించేసరికల్లా,— మొయిలు పెట్టున తుమ్మెదలు,- ఆ ప్రాంగణములో చిక్కచిత్తుగా కమ్ముకుని,— నాట్యకలాపం సాగినన్ని ఘడియలూ, తంబురల ఝూంకరింపున,- వంత చేస్తాయనీ — యీ వైనం పసిపిల్ల బాలాదికి తెలుసునే; ఆయన చెవిని పడి ఉండదా?

అలా ఎన్నేళ్ళు గడచినవి?- పదా, పాతికా?- ఆ లెక్క రాయసంవారికి తెలియాలి కాని,- శాశ్వతుని,- సన్నిధిలో ఉన్న ఆ కవిరాయనికి,- ఆ గణన ఎక్కడిది. ఆ సీమ ఆనందానికి ఏనాడో కాణాచి అయినది. పసిపిల్ల లెదిగివచ్చి,- కొమాళ్ళ తండ్రులైనారు: తాను ఆలయంలో కుదురు కున్నప్పుడు,— కుదుళ్ళ కట్టిన మారేడు మొలకలు, మహా వృక్షములైనవి; రెడ్డిరాజు కృతినందిన సుకృతము గణించి, తరించినాడు: అన్నయమంత్రి కూడా, బాగా పండబారినాడు, అంతకు మునుపు ఎన్నడూ లేనిదీ,- ఆ నాడిలా ప్రస్తావించడం జరిగింది.

అన్న మంత్రి అ సంజెవేళ, ఆలయానికి వచ్చీరావడంతోనే అన్నాడు కదా:- "మామా! యిప్పుడున్న సత్తువ యింకో క్షణానికి ఉండటం లేదు! చూడగా, యిదేదో వార్ధక్య లక్షణం లాగా ఉన్నది: అయితే కానూవచ్చునేమో! కవివి గనుక,- నేనో నారీ మన్మధుణ్ణి తాటాకుల్లో కట్టుదిట్టం చేశావు! కాని,- కాలాన్ని అరికట్టగలమా! నాకు మూడు వెనుకలబుట్టి,- నిన్న మొన్నటిదాకా నా కళ్ళముందు సిగ్గూ బిడియం లేక గంతులేసింది,- మా పెద్ద మనుమరాలు దాని పిల్లవాడికి,- నిన్న పుట్టిన రోజట,- వెయ్యేళ్ళకూ మూడేళ్ళు వెళ్ళినాయట! అవునోయీ,— యిప్పటికి యిదో ముచ్చట!- యింతకూ నేను చెప్పవచ్చిం దేమిటంటే— తెల్లవారు ఝామున మెలకువ వచ్చే వేళకు కల వచ్చింది: నీవూ నేనూ దక్షారామంలో స్వామి సన్నిధిలో ఉన్నామట! మనమే కాదు — వేలాది ప్రజ!— మహా శివరాత్రాయెను: అక్కడ ఆ చిన్నది నాట్యం చేస్తున్నది- సరే_ ఆ తుమ్మెద రొద యథాప్రకారమే! తెల్లవారు ఝామైంది. ఒక్క తుమ్మెదలేదు! అదేమో అని,— అందరం దిగ్భ్రాంతులం!- ఒక్క రెప్పపాటు!- మళ్ళీ కమ్ముకున్నాయి. ఎవర్ని? ఆమెను! తేనె చినుకులతో అభిషేకించినాయి.. అప్పుడా చిన్నది ఎలా ఉన్నదని,— శివజటాజూటం వలె! ముద్ద మందార ధగధగలాడినట్లు,





అంతలో,— కర్పూర దీపములై,- అంతలో కెంపుల రాశిమలై!- ఆ తుమ్మెదలన్నీ గుంపు కట్టి,— శ్రీగిరి-పర్వతమల్లే మేటి వేసినాయి— అన్ని గొంతులూ శంభో! అన్నాయి;— తుమ్మెదలు మాయమైనాయ్,- ఆ-చిన్నదీ మాయమైంది!- యిదీ కల;- కలే లేస్తూ:- అని ఎంతగా సంభాళించుకున్నా,— మనసు నిలవడంలేదు. తీరా,- రేపే కద శివరాత్రి!- ఏం కానున్నదో!- యీ కళ్ళకు ఆ ప్రాప్తం కూడా లేకుండా పోతుందేమో!-" యిలా కొందల మందినాడు.

"పోనీ, వింతగా పుట్టింది - విడ్డూరంగా పెరిగింది. దేవికీ దేవరకు వేడుక చేసింది. అందుకు మెచ్చి, వరమిచ్చిన వేలుపు-గిరిపై నిలిపెనేమో!-" అనినాడు శ్రీనాథుడు:

"నీ వన్నదే నిజమైతే .... యీ జన్మకింతేగద!- లే- కదులు దక్షారామం పోదాం!-"

"ఎందుకూ—"

"నీవు యాత్రకు వచ్చిన విశేషాన, నా కల అబద్ధమయేందుకు!-"

"శివుడు తలచుకుంటే శ్రీనాథుడు ఆపుతాడా!- నీకు కలలిచ్చినవాడు,- నాకు కదిలేందుకు ముగుదల యివ్వవద్దూ!- తత్పరుణ్ణై వానిని కొనియాడి కొలుచు కున్నందుకు, తన కనుచూపు మేరలోనిలువనీయకుండా తరిమి కొట్టాడు, తానే యీ నీడ చూపినాడు. వాని దయ ఆ తీరు. నే నెలా రాగలనయ్యా?—

మామా!- కోయిల ఎల్లకాలం. ఒక్క కొమ్మమీదనే ఉంటుందా?- యిక్కడ పుట్టిన మబ్బు యిక్కడే వర్షిస్తుందా?- కలలోనైనా నీకు శ్రీశైల శిఖర దర్శన భాగ్యం లభించింది— అది చాలదా?—

నీవు రావా;—

ఆమెను సాగనంపేందుకు యిద్దరెందుకు?

శివశివ-

శివులిద్దరు కారు - ఒక్కడే - అద్దములెన్నో,- అన్ని ప్రతిబింబాలు- కాని,- అధారమొక్కటే - అంతటా ఆ తళుకే!- అని మనకు తెలియనిది కాదుగా మామా!

నిజానికి,- తానొక్కడే,- తనకు నిలయమొక్కటే కాని,- సీమ కొక్క తీరున,- మరో పేరున,- కొలువు దీరడం దేనికి,- చిత్తాన జేర్చిన వారెక్కడి కక్కడే తరించడానికి!-

చకోరం కంటికి ఒక్కొక్క వెన్నెల చిందు ఒక్కొక్క చంద్ర బింబం. మన తీరూ అంతే!-

నరులలో కొందరు చకోరాలు, కొందరు చంద్రకాంతశిలలు, అర్థమయిందిగా మామా! ఎగిరిపో!-"

అన్న మంత్రి మరి మాటాడ లేదు. ఎదుట నున్న స్వామికి మ్రొక్కి,- ఎదురు చెప్పిన కవిరాయని - మ్రొక్కినంత కసురు చూపున చూచి, కదలి పోయిన వాడు కాగా,-

అక్కడ,- ఆ దక్షారామంలో ఆ మరునాడు,- అన్న మంత్రి కల అరుదూరుగా నిజమై ఊరుకున్నదట- అదెలాగంటేను.

స్వామి సన్నిధిలో,- కుహూ, నాట్యము ఆరంభమైంది.

ఆ యింతకు ముందు చెప్ప మరచాను!

ఆ చిన్నదాని పేరు - కుహూ. ఆ పేరు ఎలా,- ఎలా వచ్చింది?

ఎవరూ పెట్టారు?—

స్వామివారి వనంలో-కోయిల-

కుహూ- అని వినిపించగానే,- యీ చిన్నది.—

వెనువెంటనే ఆవంకకు బదులు చూసే దట—

ఆపేరే— పేరుకాగా,—

అలా నాట్యమాడే తరుణాన,— నిత్యకృత్యంగా, వచ్చే తుమ్మెదలు రా వ డ ం,— మ్రోయడం,— అది పరిపాటేకదా,— కాని, ఆనాడు,— అంతకు ముందెన్నడూ లేనిది,— ఆ బంభరాలన్నీ,— ముఖమంటపంలో ఆసీనులై ఉన్నవారిని కమ్ముకుని,— కన్ను మన్ను కాన నీయకుండా,— చికాకు చేయడంతో,— అక్కడే ఉన్నవారందరూ, తలకొక దిక్కుగా చెదిరి పోవడం తటస్థించింది:

అందరూ,— అ ం టే,— అన్నమంత్రి తప్ప తతిమ్మా వారందరూను:

ఆయనకు, చీమకుట్టి నట్టన్నా లేదా?

లేదు,— తనధ్యాసే లేదు.

ఉన్నట్టుండి- కనులముందు, మబ్బు కమ్ముకున్న ట్టనిపించింది. మరల చూపు అట్పేసరికి,— ఆమె కనిపించ లేదు.

ఆయన గగ్గోలు పడలేదు.

సరేలే తండ్రి నీ చిద్విలాసమే— సాగనీ అనుకున్నాడు. వేకువ వరకూ అక్కడనే కూర్చున్నాడు.

అనుష్ఠానం తీర్చుకొని,— స్వామివారి కేళీవనం జేరుకునే సరికి— అక్కడ కనిపించిన దెవరు?- ఆ చిన్నది.

చేర రమ్మని సైగ చేసింది.

ఆసీనులు కమ్మని, కనులతో మనవి చేసింది, అన్న మంత్రి,— తనకు తోడుగా,— ఉంచుకునే ఆ గ్రంథాల వంక జూసింది. అవి ఏమిటి,- భీమఖండం - కాశీఖండం!— చదివి వినిపించమని తల ఊచింది. అన్న మంత్రి పారాయణ చేసినట్లు వినిపించినాడు-

విన్నది,— అచిన్నది ఒక్కరితేనా?-

ఉహుం, గ్రామానికి గ్రామం అక్కడే ఉండెనే!—

అలా చదివించు కున్నది.

విన్నది—

శంభో!— అన్నది!—

అది, మరింత విడ్డూరం కాదూ!-

అన్నాళ్ళకు పలుకు వచ్చిందా?—

వాడు అప్పటికి పలుక నిచ్చాడా?

ఏమోలే!— అది మన ఊహకు మాలిన విషయం.

వినడం పూర్తికాగా,— యిక ఉన్నచోట ఉండలేదు.

కదిలింది,

అమ్మా అమ్మా అంటూ అందరూ ఆక్రోశించినారు. వెంటకదిలినారు. అన్న మంత్రి వారినందరినీ నిలుపు జేసి,- తానొక్కడే,— ఆమెను, అనుసరించినాడు.

కేళీవనం,- విడిచి వచ్చినారు,

ఏడడుగులు వేశారు.

"తాతా!— మల్లెల పూజల మక్కువల వాడు— మనసుపడి రమ్మని మరులంపినాడు,

సిగపూవా, రావే యనె— నగుమోమున



చెరిసగమ్ము నాదేయనె, నీ సొగసుల వనుగై నేయవె, జిగికెంపుల మోవి సుధలు జిలుకన్ రావే-

అని తుమ్మెదలు వార్తలం దిం చి న వి కదా! .. ఆ అయ్య కెరిగించ వయ్యా శివానంద!...."

అలా పలికిందై,- కుహూ,- ముందుకు సాగి పోతూండగా,- అన్నమంత్రి మనసు పరిపరి విధాల పోయింది,- కాని, కాలు కదల్చ లేకపోయినాడట- ఆమె కనుచూపు మీరి పోయేంత వరకూ అలాగే నిలుచున్నాడట...

నిలుచున్న దెవరు?- అన్నమంత్రి కాదు- శివానందుడు. ఆక్షణం నుంచీ శివానందుడు.

అడుగు దానంతట అదే కదిలింది- కేళీ వనం జేరుకున్నాడు. అక్కడే ఉండిపోయినాడు. ధన్యాత్ముడు కదా!-

అలా ఆచిన్నది. అక్కడ నుంచి కదలిందా?

తిరిగిన దేశంకాదు - వెంట ఎవరూలేరు.

ఒక్కగా నొక్క అడకూతురు.... ఏళ్ల గడచి, ఊళ్లగడచి,- ఎలా జేరుకున్నది శ్రీశైలం?-

ఎలాగేమిటి?- వాడే చేదుకున్నాడు.

అంతే కద!-

సరే అంతదూరం వెళ్ళింది? ఆలయం లోనికి వెళ్ళింది, అక్కడ ఏం జరిగిందను కున్నారు?-

దైవదర్శనం జేసివస్తున్న ముమ్మడి కొంతయ్య అనే ఒక చిన్నవాడు అడుగు బెడిసి,- కొండల పెట్టున కూలబడటం సంభవించింది. కొండల పెట్టున- అంటే తేలిపోవడం లేదూ- పైగా ఆ పడ్డ పాటు సామాన్యమా?- ముందు చతికిలబడి,- వెంటనే సాగిలపడగా,- చూసే వారికి, ఎలాఅనిపించిందంటే- యీ పెద్దమనిషి ఎదురొచ్చిన ఆడమనిషికి మొక్కుతున్నట్టూ తోచింది-

అదిసరే- మరొకరూ మరొకరూ అయితే అది చూసి,- ఎలా విరగబడి ఉండేవారో,- కాని,- పడ్డవాడు,- పెద్దశెట్టి- కుబేరుడి తమ్ముడు, ఎదుటి మనిషిని దేవుడల్లే చూసుకునేవాడు. అలాటి వాడు,- నిజంగానే,- పడ్డాడే అనుకుందాం- చూసి నవ్వేవల్లనా?- అలా అని- నలుగురూ ముందుకు వచ్చి చే అసరా యిచ్చి లేవదీశారా?- అలాంటి స్థితిలో, ఆయన ఉండగా,- తాము ముందుకు రావడం తగునో- తగదో అనే అంచాయింపు ఉంటుంది కద!- కాగా,- అలాపడ్డవాడు,- అలాగే ఒక్కనిమేషం ఉండి — అమ్మా! అనుకున్నాడు- యీ చిన్నది,- అన్నా!- అన్నది పసిపిల్లవాడిని లేవనెత్తినట్లు లేవదీసింది.

అలాపడటంలో,- కాలు కొంచెం మెలిక పడినదేమో - అడుగువేయ లేకపోయినాడు. "అయ్యా మల్లికార్జునా,-" అనిగంట మ్రోగినట్టు మ్రోగినాడు. అడుగు తిన్ననైనది.

"అమ్మా! చూడగా నాకన్న చిన్నదానవు. చూడకుండానే మ్రొక్కాను. వాడిదయ-

"అన్నా"- అన్నావు - వాడనిపించాడా అమ్మా?-

నాకు, తోడబుట్టిన వాడు లేరు-

వాడు యివ్వలేదు.

సీమలో వారందరూ, మా తాత తండ్రుల కలిమిచూసి,- నన్ను- గౌరవిస్తారు కాని,-

అన్నా- అని అన్నది నీవాక్క_త్తెవే!- నాకు యిన్నాళ్ళకు తల్లీ తోడూ అంటూ అబ్బింది- సరేనమ్మ- నా చెల్లెలు పేరేమో-"

"చెల్లెలే"

"తల్లితోడూ-"

"దైవమే."


"ఆలనా పాలనా జేసేది-"

"ఆలయంలో- వారే!"

"అర్థం కాలేదమ్మా:"

"నాకూ అర్థం కాలేదన్నా!- వాడిని అడిగేందుకే వచ్చాను, నేను రావడమా? తప్పించు కున్నారా?

అన్నా. దక్షారామంలో.- స్వామివారి కేళీవనానికి- కవనం వచ్చింది. వనానికి వసంతం వచ్చింది. ఆ వసంతంలో.- ఒక



పువ్వుపూసింది, ఒక కాయ కాచింది ఒక తల్లి కడుపున.

తల్లి ఒడిలో బిడ్డను- ఆలయంలో వాడు లాక్కు_న్నాడు- మూగను చేసి నాట్య మిచ్చాడు. సాగిపోవే అని పలుకిచ్చాడు. పొమ్మన్న తావుకు జేరుకున్నాను. రమ్మన్న దెందుకో!___."

"మరెందు కమ్మా!- మా క న్ను ల వెన్నెల కాచేందుకు. యిప్పటికి తెలిసి వచ్చినదమ్మా!- నీరాకతో శ్రీగిరి ఘుమ ఘుమ లాడుతూంది. ఆలయ భాగమంతా ఏకంగా మల్లికా నికుంజమైనది- యెంతటి దయా నీదయ మల్లికార్జునా!-"

యిలా వారు పలుకాడి బాసాడిన వారు కాగా,-

అనంతరం ఏమైనది?-

ఆలయంలోకి స్వామి దర్శనానికని వచ్చిన చిన్నది,- ముందుకు అడుగు వేయ కుండా వెను దిరగంగా,- శాంతయ్య.- "అదేమమ్మా" అన్నాడు.

"వారు నన్ను యిక్క_డ ఆగమన్నారు- నా ఎదుట పడేందుకు- వారికి బిడియమేమో- పోనీ – అన్నా,- యిదో, యీ చెంపను,- పది బారలిటు నడచి పది బారలటు నడచి,- నడచి నడచి,- వంచిన తల ఎత్తగనే ఎదుట మల్లెల వనమున్నది, అందులో,- మంచిగంధపు మ్రానున్నది- ఆ మ్రాను నీడను, నన్ను నిలువమన్నాడయ్యా-" అంటూ సాగిపోతున్నది- "అన్నా వెన్నెల వేళకు, యీ చెల్లెలిని చూడరావా!, అని,- కనుచాటైంది.

అలాగే,- వెన్నెల ముసిరే వేళకు,- శాంతయ్య.- అడుగులో అడుగు వేసు కుంటూ మల్లెల వనం జేరుకున్నాడు.

వెన్నెల మరింత వెలుగులో ఉన్నది- అంతలో రవ్వంతమేర,- ఎఱ్ఱని చీకటి! అందులో ఆ చిన్నది- హిమనగ శృంగంవలె నున్నది.-

బాల నాగము లామెకు సొమ్ములు,-

పైన మిణుగురులు,- వెలుగు పట్టినవి-

అచెంపా ఈచెంపా,- పడగలు విచ్చి కోడె త్రాచులు ఆ మూర్తికి వీవన సేవ జేస్తూన్నవి.

శాంతయ్యకా నెలవు కైలాస మనిపించి నది—

అలాగే - తెలవారినది;—

శ్రీ శాంతయ్య భిక్షావృత్తి యతీంద్రులు,-

తమ మూలభృత్యుడైన దేవయ శాంతయ కోసం కలయ జూసినారు; అతడు కాన రాలేదు;-

యతీంద్రులకు పుష్పోపహారము సమ ర్పించడం వానివిధి, ఆ పూవులు తానై తెంకలకు ప్రసాదంగా పంచి యివ్వడం నిత్యకృత్యము; అతను లేనిదే ఆ వైభవం జరుగదు -

ఆనాడు,- ఆ వేళకు- రాలేదు-

తీరుబడిగా, వచ్చినవాడు- మనవులిచ్చు కోలేదు,- యతీంద్రులకు తామసం-ఆగలేదు మృదువుగానే గద్దించినారు- ఆతడూ, విన యంతోనే బదులు పలికినాడు ఏమని?

"యీ గిరిని పూచిన పూవు, దైవానికే గాని, దైవ స్వరూపులని మేము భావించే తమకైనా సమర్పించడం అపచారమేమోనని భావన కలిగింది."

యిలా పలుకడం అపచారమని వారు భావించినారు. కాని, లోకజ్ఞులు కావడంతో- అదిన్నిగాకుండా శమదమాదులు కొంత మట్టుకైనా అలవడి ఉన్నవారు కావడంతోనూ వారు.- మందహాసము చేసి, మౌనము వహించినారు; కాని,శాంతయ్య ఆ మౌనాన్ని సహించలేదు.

"గిరిని వెలసిన వాడు,-కింకరుల సేవలు యింతకాలము చేకొన్నవాడు,- మనకు కైవల్యమీయ దలచిన వాడు, తన మహిమ జూపినాడు గురుస్వామీ!

పూజకై పుట్టి,- పుణ్యాన పెరిగి,- నాట్యాన సేవించి, నవకమ్ము దేలి—

"సీమకాని సీమలో,- సుమ్మ కోమలి పరిమళించిన దాయెనయ్యా- పరిమళమిచ్చిన దేవర, పరవశమిచ్చి బంభర నాదాన మెచ్చి,- తన సేవలకై తానై తరలించుకు వచ్చినాడు—

"కనులతో వెదకితే కానని వనములో,-
కల్యాణి కాపురమ్మాయెనయ్యా-
తన తెలిదళుకా తరుణి కొసంగి,-
తన సొమ్ములు నెమ్మేనికి దార్చి,-
తన పూజాద్రవ్యము నాఘనుడేలేనయా!-"

—యిలా శాంతయ్య పలుకంగా,- ఆ సన్నిధిలో ఉన్నవారికి ఎలా అర్థమవుతుంది? శాంతయ్య చపలచిత్తు డాయెనేమో అనుకున్నారు. యతీంద్రులు మట్టుకు ఆకళింపు జేసుకుని,- శాంతయ్యా! మా కనులకు ఆ పుణ్యము దాపురించేనా-- అనగా,- అయ్యా - మీకూ ఆ ప్రాప్తము వాడే అనుగ్రహించేనేమో-" అని. వెనుదిరిగి పోగా యతీంద్రులు తామొక్కరూ, వానిని అనుసరించి పోయిన వారైరి? ఎక్కడికి?

అక్కడికే,- కాని, దర్శనం లభించిందా?- లేదు- అల్లంత దూరాన ఉండగానే,- నాగు పాములు బుసలుకొట్టి,-తరిమికొట్టినవి. ఎవరిని?- యతీంద్రులను. శాంతయ్య,- తన కులాన బుట్టిన పిరికితనాన్ని యతీంద్రుల వెంట సాగనంపిన వాడు కావడంచేత,- బెంకూ గొంకూ లేక పోయింది. యతీంద్రులు,- ఏక బిగివిని, వెనుజూడకుండా తమ ధర్మాసన స్థలి జేరుకున్నారు. శాంతయ్య మరో ఝాముకు తిరిగి సన్నిధికి వచ్చిన వాడైనాడు. అప్పటికి యతీంద్రులు తెప్పరిల్లినారు. మరల ఎప్పటి తీరైనారు.

అక్కడి కథ – అది!–

యిక్కడ రాజమహేంద్రవరములో— అన్న మంత్రి వర్తమానం తెలిసింది. శ్రీనాధునికి తెలిసింది— అతడు స్వామి వంకజూసి,- ఆలయం విడిచి వచ్చినాడు! ఆకసం వంక జూసినాడు,-

స్వామి ఆలయంపైన మబ్బు కట్టింది.

కట్టిన మబ్బు, గాలి తరుము తున్నట్లు సాగిపోయింది.

శ్రీనాధుడూ కదలినాడు- దక్షారామం జేరుకున్నాడు-

శివానందుడు, కవిరాజును చూసి పకపకలాడినాడు-

కుహూ పలికిన పలుకులు వినిపించినాడు-పైగా అన్నాడు కదా- మామా!- యిక నేనిక్కడ - నీ వక్కడ! వనంగాని నవంలో, ఘనంగా మంచి గంధపు పరి





మళం-శ్రీ గిరి పురమై-కాపురమైన వానికి.- ఆ చందన చర్చ నీవు లేనిదీ జరుగదట.- పోయేవా?- నీ కవనం, ఏ కాలానికి మా వరమై,- తెలుగు తనానికి వరమై నిలవాలని.-

శివానందుడి తపస్సు.
నీ కవితే - నా కైవల్యం-
యిక నీవూ తరించేవులే-
తరలిపో(.-" అంటూ కౌగలించుకున్నాడు; శ్రీనాధుడు శివానందునికి,- సాష్టాంగ ప్రణామము జేసి:- కదలి పోయినాడు.

శ్రీశైలంలో, యతీంద్రుల సన్నిధిలో ధర్మబోధ ప్రారంభమైనది. వారు - యీశాన సంహితలోని సుకుమారుని కథను వివరించినారు. వినిన వారిలో శ్రీనాధుడూ ఉన్నాడు. ఏ మాకథ-

సుకుమారుడు - వేదశాస్త్ర సంపన్నుడు.

దానికి తోడు సంపన్నుడు-

తలిదండ్రుల కొక్కడే బిడ్డ- వరప్రసాది, మంచి రూపసి. అలాటి చిన్నవాడు యౌవనోదయంతో వెర్రి మరులెత్తి.- సీమనున్న కన్యలను నిలవనీయలేదు. ఏలేవాడు యీ ఆతతాయి తనాన్ని మన్నించుతాడా,- బ్రాహ్మణుడు కావడంతో తల దీయించకుండా ఆ సీమ నుంచి తగిలేయించాడు. యిక అక్కడితో వానిగతి మరో అధోగతి. చాండాలికి ప్రియుడైనాడు,- కన్న కూతుళ్ళతో కాపురము చేసినాడు,- చివరకు దిక్కుమాలి అంతరించినాడు; వాని కోసం యమ దూతలతో శివ దూతలు హోరాహోరీ పోరాడి - జయించినారు; సుకుమారునికి శివసాయుజ్యం లభించింది.

ఎందుచేత?-

ఒక శివరాత్రినాడు,- తినుటకు ఏదీ దొరకకపోవడంతో వానికి ఉపవాసం. శివనామం చెవిని బడ్డది. అదీ వాని సుకృతం

ఎంతటి పాపాత్ముడైనా తరించేందుకు అవి చాలును!-

యిదీ సారాంశం.

శ్రీనాధు డనలేదు- అనకపోగా,- పైగా, సంశయాత్ముడైనాడు.

చిత్తశుద్ధిగా చేసిన పాపం- శివనామం తుడిచివేస్తుందా? పుణ్యాన బోయేందుకు, పాపుల కథలు వినవలెనా?

యిలా అని మనసులో అనుకోలేదు- యతీంద్రులకు విన్నవించినాడు, వారనినారు కదా– "శ్రీనాధకవీ– అందరూ నీవంటి వేత్తలుండరు, యీ ప్రసంగము నీకోసము కాదులే,– వీరికోసము. వీరిని బోలిన వారు వేలాది ఉన్నారు. అందరూ తరించవలెగద. అది,– జగదీశ్వరుని అభిమతము కద!- యీ కథను కావ్యముగా రచించమని,– నీకు ఆదేశించమని శివాజ్ఞ అయినది -.." విన్న వారు అందుకు హర్షించినారు.

శ్రీనాధుడనినాడు కదా "స్వామీ నన్నెన్నడూ కానిపని చేయమని శివుడు ఆదేశించలేదు. ఆజ్ఞ నేయలేదు– నాకవనం నాకడలేదు- వానికై వసమైనది–

కావ్యము రచించిన వాడే రచించవలెగాని,- యిక నాతరమా?-

అయినా,- తరించేందుకు,- కావ్యాలాపమవసరమా! శివస్మరణ చాలదా?- అందుకు అనుజ్ఞ యివ్వండి!-

యతీంద్రులు అన్నారు కదా-

"యిది, శివాపరాధం"

"నేను సాపరాధినే,- కనుకనే తరింపవలెననే తపనలో ఉన్నాను, నాకు యీ పుట్టువిచ్చినవాడు,- నాచేత కవన మల్లించినాడే కాని పాపకర్మని చేయలేదు. పాపులను వర్ణించేందుకు పలుకీయలేదు. అందుకు తామే సమర్థులని తోచుచున్నది" యీ మాటలు విని - అందరూ ప్రమాన్పడినారు. ఒక్క శాంతయ్య మాత్రం. ఆతరుణానికి,- ఎక్కడనుండో

పరుగున వచ్చి,- యతీంద్రులనూ, మరెవ్వరినీ గమనించకుండా, శ్రీనాథునికే మ్రొక్కి - మ్రొక్కిన చేతులతోనే కౌగిలించుకొని,

కవిరాయా, నీ కవనం వనమైనది.

వనానికొచ్చిన చిరునవ్వే వనమాలైనది.

కదలి వచ్చిన ఘనసార కళిక

సామేని వానికి అరతమ్యేను - జనకారమ్మన్నది.

అనడం ఏమిటి, శాంతయ్య వెంట శ్రీనాదుడు కదలడ మీమిటి-

కానరాని వనంలో ఘనసార కళిక,

కనువిప్పి చూసింది - కలకల లాడింది-

జనకా అన్నది,- చేయెత్తి మ్రొక్కింది-

శాంతయ్య,- తనలో తాను లేడు-

నాగములు. కంకణ బంధము విచ్చి బరాబరులుగా, బుసలు కొట్టినవి. శ్రీనాథుని వాణి శంభో, అని మార్మోగింది - ఘనసార కళిక ప్రజ్వలించింది.

స్వామివారి ఆలయంలో, వేయి మెరుపులు మెరసినట్లు, ముమ్మారు తళుకు క్రమ్మినది.

యతీంద్రుల మనసు మహా దేవా: అన్నది.

ఏడీ శ్రీనాదుడు!

తన కవనాన లేడా! ●

---

● చిలకని పెంచాలనే మోజు పుట్టి ఒకడు బజారుకెళ్లి బేరం చేశాడు. "మీకుగనక యాభైరూపాయలకే ఇస్తున్నాను. దీని అసలు ఖరీదు వంద రూపాయలు. ఇది మాట్లాడ్డమేకాదు, పాటలుకూడా పాడుతుంది. అచ్చు లతా గొంతుకే ననుకోండి," అన్నాడు అంగడివాడు.

యాభైరూపాయలూ ఇచ్చి కొన్న ఆసామీ మూడోనాటికల్లా చిలకని తిరిగి తీసుకొచ్చాడు.

"ఏంసార్, చిలక బాగాలేదా? పాటలు పాడ్డంలేదా?" అన్నాడు అంగడివాడు.

"పాడకేం? పాడుతోంది. కాని లతా గొంతిక కాదు ఆశా భాన్స్లే గొంతిక. నా కక్కర్లేదిది," అన్నాడు ఆసామీ.

# ఇంక్రిమెంటాలిటీ



## ఉభయ తారక మంత్రాలు :

*మన స్తత్వాలు అనేకవిధాలు. గవర్నమెంటాలిటీ, డిపార్టుమెంటాలిటీ, ఆర్గ్యుమెంటాలిటీ...కాని ఇంక్రిమెంటాలిటీలో ఒక విశేషం వుంది. ఇది యజమానికి, ఉద్యోగికి కూడా వర్తిస్తుంది. ఇంక్రిమెంట్ కూడదని వీరికి, ఇవ్వాలని వారికీ. ఇది నిరంతర ద్వయం.*

*ఒకరినొకరు జయించే ఉపాయాలు ఈ తరువాత పుటలలో వున్నాయి. మా పత్రిక కొన్నవారికే ఇవి పనిచేయవచ్చు.*